సాక్షి
కుమురం భీం
బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



లక్ష్యం దిశగా అడుగులు

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు గడువు మార్చి 31తో ముగియనుంది. 70 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సాధించేందుకు సింగరేణి కంపెనీ పరుగులు పెడుతోంది. 8లో▸



బెంబేలెత్తిస్తున్న కుక్కలు

కౌటాల మండలంలో కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గుంపులుగుంపులుగా తిరుగుతూ ప్రజలతోపాటు పశువులపై దాడులకు తెగబడుతున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.2 /16.4

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న చైర్మన్ కనక యాదవ్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. అలాగే పోటీ పరీక్షల కోసం తెలంగాణ చరిత్రతోపాటు ఇతర పుస్తకాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. సిర్పూర్(టి), రెబ్బెన గ్రంథాలయాల భవనాలు కూలినందున ప్రత్యామ్నాయ భవనాల కోసం ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు గౌరవ వేతన పెంపునకు ఆమోదం తెలిపామని చెప్పారు. గ్రంథాలయ కార్యదర్శి మునీశ్వర్‌రావు, మరియాల ఉదయ్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు కాగజ్‌నగర్‌లో స్టడీ సెంటర్ సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఎస్‌కేఈ డిగ్రీ కళాశాలలో ఈ నెల 2న నిర్వహించే డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ సమావేశానికి విద్యార్థులు, పూర్వ విద్యార్థులు హాజరుకావాలని ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ దత్తాత్రేయ అన్నారు. ఓపెన్ యూనివర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షలు, స్టడీ మెటీరియల్ ఇతర సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాల కోసం 98663 98678 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రోగుల ఆకలి కేకలు



వాంకిడి ఆసుపత్రిలో బయటి నుంచి తెచ్చుకున్న ఇడ్లీ తింటున్న బాలింత

సాక్షి విజిట్

సాక్షి, ఆసిఫాబాద్: పిడికెడు మెతుకులు పెడితే.. కడుపు నిండుతుందా? రుచి లేకుండా.. చాలీచాలని కూరలు అందిస్తే అన్నం తినగలరా? రోగులకు ప్రభుత్వాసుపత్రుల్లో బలవర్ధకమైన ఆహారం సక్రమంగా అందడం లేదు. అర్ధాకలితో రోగులు కేకలు పెడుతున్నారు. మంచం నుంచి కదల్లేక.. బయటి నుంచి భోజనం తెచ్చుకునే ఆర్థిక స్థోమత లేక రోగులు అల్లాడుతున్నారు. ఆసుపత్రి అధికారులు చూపుతున్న ఆహార పట్టికకు, క్షేత్రస్థాయిలో ఇస్తున్న భోజనానికి పొంతనే ఉండటం లేదు. కాంట్రాక్టర్‌కు మాత్రం అధికారులు ప్రతినెలా తంతునుగా బిల్లులు చెల్లిస్తున్నారు.

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందని పౌష్టికాహారం
- చాలీచాలని అన్నం, కూరలు
- బయటి నుంచి టిఫిన్లు తెచ్చుకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- 'సాక్షి' పరిశీలనలో పలు విషయాలు వెల్లడి

కడుపు నింపని భోజనం..

ఆసుపత్రుల్లో రోగులకు ప్రభుత్వం అందిస్తోన్న ఆహారాన్ని కూడా కొందరు గద్దల్లా తన్నుకుపోతున్నారు. నాలుగైదు రోజులు చికిత్స పొంది వెళ్లే వారు ఈ దోపిడీని ప్రశ్నించడం లేదు. దీంతో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పెద్దాసుపత్రితోపాటు తిర్యాణి సీహెచ్‌సీ, వాంకిడి పీహెచ్‌సీ, జైనూర్ సీహెచ్‌సీ ఆసుపత్రుల్లో రోగులకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారంపై మంగళవారం 'సాక్షి బృందం' పరిశీలన చేపట్టింది. ఆయా ఆసుపత్రులన్నింటికీ పౌష్టికాహారం సరఫరా చేసే కాంట్రాక్ట్‌ను ఖానాపూర్‌కు చెందిన షాకీర్ అనే వ్యక్తి దక్కించుకున్నాడు. అతను లాలానాయక్ అనే బినామీకి ఆహార సరఫరా బాధ్యతలు అప్పగించాడు. వీరు ఆసుపత్రిలో భోజనం నిర్దేశిత పరిమాణంలో ఇవ్వటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆహార పట్టిక చూస్తే అద్భుతంగా ఉంటుంది. రోగులకు ఇస్తున్న భోజనం చూస్తే నాణ్యతాలోపం స్పష్టంగా కనిపిస్తోంది.

పట్టిక చూసి మోసపోకండి..!

ఆసిఫాబాద్ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన పట్టిక చూసి మోసపోకండి. ఎందుకంటే అందులో చూపిన విధంగా భోజనం ఇవ్వటం లేదు. కనీసం పిల్లలకు నిర్దేశించిన పరిమాణంలో కూడా పెద్దలకు అందడం లేదు. హోటళ్ల నుంచి భోజనం, టిఫిన్ తెచ్చుకుంటేనే కడుపు నిండే పరిస్థితి.

- ప్రతిరోజూ రోగులకు అందించాల్సిన అల్పాహారంలో 150 గ్రాముల ఇడ్లీలు(3), 100 గ్రాముల చట్నీ ఉండాలి. లేదా 100 గ్రాముల రవ్వతో చేసిన ఉప్మా లేదా 300 గ్రాముల కిచిడీ వడ్డించాలి. రోజులో ఒకసారి 100 మి.లీ. పాలు(చక్కెరతో కలిపి) లేదా చాయ్ ఇవ్వాలి. అయితే అల్పాహారంలో ఇడ్లీ ఉండటం లేదు. కేవలం ఉప్మా వడ్డిస్తున్నారు. అందులోనూ చట్నీ పరిమాణం తగ్గించేశారు. టీ కూడా అసలు ఇవ్వడం లేదు.
- ఆహార పట్టికలో పురుషులు/మహిళలకు 600 గ్రాముల భోజనం లేదా 6 పుల్కాలు ఇవ్వాలి. పిల్లలకు 300 గ్రాముల భోజనం వడ్డించాలి. అదీమసూరి బియ్యంతో వండి ఆహారాన్నే ఇవ్వాలి. కానీ ఆసుపత్రిలో సరఫరా చేస్తున్న భోజనం నాణ్యతలేని బియ్యంతో వండి సరఫరా చేస్తున్నారు.
- ప్రతిరోజూ కూరగాయలతో వండిన కూర, సాంబారు, 200 మి.లీ. మజ్జిగను అందించాలి. భోజనంతోపాటు కోడిగుడ్డు, అరటిపండు ఇవ్వాలి. కోడిగుడ్లు వారానికోసారి ఇస్తున్నారు. సాంబారు, మజ్జిగ, అరటిపండు ఇవ్వడం లేదని రోగులు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో పలు ఆస్పత్రుల్లో ఉదయం అల్పాహారం నుంచి మధ్యాహ్నం, రాత్రి సక్రమంగా భోజనం అందుతుందా అని పరిశీలించగా పలు విషయాల్లో వెల్లడయ్యాయి. కొన్నిచోట్ల రోగులు లోపాలు చెప్పేందుకు వెనుకడుగు వేశారు.



ఆసిఫాబాద్ ఆసుపత్రిలో మధ్యాహ్నం రోగులకు అందించిన నీళ్లచారు

- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 13 మంది రోగులు ఉన్నారు. ఇక్కడ రోజూ ఉప్మానే వడ్డిస్తున్నారు. మధ్యాహ్నం నీళ్లచారు, బీన్స్ కర్రీతో భోజనం పెట్టారు. మజ్జిగ, గుడ్డు, అరటిపండు ఇవ్వలేదు.
- వాంకిడి 30 పడకల ఆసుపత్రిలో మంగళవారం ఐదుగురు గర్భిణులతోపాటు మరో 21 మంది రోగులు చికిత్స పొందారు. వీరికి ఉదయం ఉప్మా పెట్టగా, మధ్యాహ్నం నీళ్లచారు, టమాట కర్రీ, గుడ్డుతో సరిపెట్టారు. ఇదే పరిస్థితి తిర్యాణి, జైనూర్ ఆస్పత్రుల్లోనూ కనిపించింది.

గుడ్డు, మజ్జిగ ఇవ్వలేదు



నా కుమారుడికి దగ్గు, జ్వరం వస్తే ఆసిఫాబాద్ ఆసుపత్రిలో చేర్పించాను. చికిత్సకు వచ్చి రెండు రోజులు దాటింది. ఉదయం పూట ఉప్మా పెడుతున్నారు. గుడ్డు, మజ్జిగ, పండు ఇవ్వలేదు.

– లీలాబాయి, మద్దికుంట, మం.రెబ్బెన

పెట్టిందే తింటున్నాం



తిర్యాణి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మెనూ ప్రకారం కోడిగుడ్డు, పెరుగు ఇస్తలేరు. భోజనంలో ఒక కూర తోపాటు నీళ్ల సాంబరు ఇచ్చారు. ఉదయం పాలు కూడా లేవు. ఎవరిని అడగాలో తెలియక ఇచ్చిందే తింటున్నాం.

– సొల్లు పోషయ్య, విజయనగరం, మం.తిర్యాణి

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బదిలీ

- నిర్మల్ కలెక్టర్‌గా వరుణ్‌రెడ్డి
- కొత్త పీవోగా ఎవరు వచ్చేనో..?



వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డిని నిర్మల్ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పీవోగా ఇంకా ఎవరికి పోస్టింగ్ ఇవ్వకపోవడంతో కొత్తగా ఎవరు వస్తారో అనే ఉత్కంఠ నెలకొంది. గతంలో కుమురంభీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన కె. వరుణ్‌రెడ్డిని గతేడాది జూన్ 13న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా ప్రభుత్వం నియమించింది. పీవోగా ఏడు నెలల 18 రోజుల పాటు బాధ్యతలు నిర్వహించిన వరుణ్‌రెడ్డి గిరిజనాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. వివాదరహితుడిగా పేరుపొందిన ఈయన ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి స్థానికులతో మమేకమయ్యారు. ఏజెన్సీ గ్రామాల్లో గిరి పోషణ్ కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా 'మిషన్ లక్ష్యం' పేరుతో వంద రోజుల ప్రణాళిక అమలు చేశారు. అలాగే మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకు గిరిజన విద్యార్థులు చదవడం, రాయడంతో పాటు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేలా వంద రోజుల ప్రణాళికలో భాగంగా అక్షరజ్యోతి కార్యక్రమం అమలు చేశారు. ఇటీవల ప్రభుత్వం సర్కారు కొలువుల భర్తీకి చర్యలు చేపట్టడంతో ఉట్నూర్, ఇచ్చోడ, బెల్లంపల్లి ప్రాంతాల్లోని వైటీసీ కేంద్రాల ద్వారా నిరుద్యోగ గిరిజన యువతకు ప్రత్యేకంగా ఉచిత శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పీటీజీ గిరిజన నిరుద్యోగ యువతపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గిరిజనులకు తక్కువ ఖర్చుతో గృహ నిర్మాణాల కోసం చర్యలు చేపట్టారు.

కొత్త కలెక్టర్‌గా యాస్మిన్ బాషా

- ఆదిలాబాద్ జిల్లాకు రాహుల్‌రాజ్ బదిలీ



షేక్ యాస్మిన్ బాషా

ఆసిఫాబాద్: కలెక్టర్ రాహుల్ రాజ్ బదిలీ అయ్యారు. రాష్ట్రంలో ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఆయన స్థానంలో షేక్ యాస్మిన్ బాషా నియమితులయ్యారు. వనపర్తి కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న షేక్ యాస్మిన్ బాషాను కుమురంభీం జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాహుల్‌రాజ్‌ను ఆదిలాబాద్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. కొత్త జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఏర్పడిన కుమురంభీం జిల్లాకు తొలి కలెక్టర్‌గా చంపాలాల్ పనిచేశారు. రెండో కలెక్టర్‌గా ప్రశాంత్ పాటిల్, మూడో కలెక్టర్‌గా రాజీవ్‌గాంధీ హన్మంతు, నాలుగో కలెక్టర్‌గా సందీప్‌కుమార్ ఝా, ఆ తర్వాత రాహుల్‌రాజ్ సేవలందించారు. ఆరో కలెక్టర్‌గా షేక్ యాస్మిన్ బాషా రానున్నారు.

26 నెలలపాటు విధులు

కలెక్టర్ రాహుల్‌రాజ్ జిల్లాలో రెండు సంవత్సరాల రెండు నెలలపాటు సేవలందించారు. తొలిరోజుల్లో కోవిడ్ ప్రభావం ఉండడంతో పాలన ఆంక్షలతో కొనసాగింది. కోవిడ్ నియంత్రణకు ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ పర్యవేక్షించారు. అయితే ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆసిఫాబాద్ ఆర్డీవోకు అవినీతి అక్రమాలకు పాల్పడున్నాడని తుడుందెబ్బ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించగా, కలెక్టర్ నిక్కచ్చిగా వ్యవహరించలేదనే విమర్శలున్నాయి. ఎన్నడూ లేనివిధంగా కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను బదిలీ చేయాలని అఖిలపక్షాలు, యువజన సంఘాలు, కుల సంఘాల నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నాకు సైతం దిగారు. అలాగే జిల్లా కేంద్రంలో బెలూన్ థియేటర్ ఏర్పాటు, పిల్లల పార్కు సుందరంగా తీర్చిదిద్దారు. కుమురంభీం ప్రాజెక్టు వద్ద టూరిజం కోసం బోటు ఏర్పాటు చేశారు. కుమురంభీం జిల్లాపై మమకారంతో కలెక్టర్ స్వయంగా రాసిన పాట స్థానిక ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.

జిల్లాలో పనిచేసిన కలెక్టర్లు

చంపాలాల్	11.10.2016 నుంచి 18.12.2017
ప్రశాంత్‌పాటిల్	19.12.2017 నుంచి 30.08.2018
రాజీవ్‌గాంధీ హన్మంతు	01.09.2018 నుంచి 03.02.2020
సందీప్‌కుమార్ ఝా	04.02.2020 నుంచి 08.11.2020
రాహుల్‌రాజ్	09.11.2020 నుంచి 31.01.2023

యాస్మిన్ బాషా నేపథ్యం..

కుమురంభీం జిల్లా ఆరో కలెక్టర్‌గా షేక్ యాస్మిన్ బాషా బాధ్యతలు స్వీకరించనున్నారు. యాస్మిన్ బాషా (2015 ఐఏఎస్) వనపర్తి కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడికి రానున్నారు. 2020 ఫిబ్రవరి 3న ఆమె వనపర్తి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు సిరిసిల్ల జేసీగా పనిచేశారు.

'పోడు' పంపిణీకి కసరత్తు

- ఫిబ్రవరిలో పట్టాలు అందించేందుకు చర్యలు
- ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తుల రీవెరిఫికేషన్
- 1,18,000 ఎకరాల పోడు భూమికి 11,827 దరఖాస్తులు
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు



జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులను రీవెరిఫికేషన్ చేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్: దశాబ్దాలుగా గిరిజనులు పోడు హక్కుల కోసం పోరాడుతున్నారు. అర్హులకు పట్టాలు ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆదేశాలతో ఈ సమస్యను వీలయినంత వేగంగా పరిష్కరించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫిబ్రవరి రెండో వారం నుంచి పోడు భూముల పట్టాలు పంపిణీ చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎఫ్ఆర్‌సీ కమిటీ సభ్యులతో గ్రామసభలు పూర్తి చేసి, ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులకు పట్టాలు జారీ చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో పోడు భూముల పట్టాల కోసం వచ్చిన దరఖాస్తుల రీవెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించారు.

11,827 పోడు దరఖాస్తులు

జిల్లా వ్యాప్తంగా 335 గ్రామ పంచాయతీలు ఉండగా 260 పంచాయతీల్లో 1,18,000 ఎకరాల పోడు భూమికి 11,827 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 6,323 గిరిజనులు, 5,504 గిరిజనేతరులు దరఖాస్తులు సమర్పించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వివాదాలకు తావులేకుండా పూర్తి పోడు భూముల సర్వే పూర్తిచేశారు. ఎఫ్ఆర్‌సీ కమిటీలో మూడో వంతు గిరిజనులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. అక్టోబర్ నుంచి సర్వే ప్రారంభం కాగా, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

దరఖాస్తుల రీవెరిఫికేషన్ షురూ..

పోడు సర్వే పూర్తయినా చాలా మందిలో హక్కు పత్రాలు ఎప్పుడు వస్తాయోననే ఆందోళన ఉంది. తాజాగా దరఖాస్తుల రీ వెరిఫికేషన్ ప్రారంభించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పోడు సాగు చేసుకుంటున్న రైతులు తమకు ఇకపై భూమిపై హక్కులు వచ్చినట్లేనని సంబురపడుతున్నారు. పోడు దరఖాస్తుల పరిష్కారానికి ఎఫ్ఆర్సీ కమిటీ, ఫారెస్ట్ రైట్స్ యాక్ట్– 2006 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. నిబంధనల ప్రకారం 2005 కంటే ముందు సాగులో ఉన్న గిరిజన రైతులు, మూడు తరాల ముందు నుంచి సాగు చేసుకుంటున్న గిరిజనేతరులకు అవకాశం కల్పించారు. ప్రతీ పంచాయతీలో అటవీ హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులతో కలిసి ఎఫ్‌బీవో, పంచాయతీ కార్యదర్శి సర్వే చేపట్టారు. అటవీశాఖ అగ్రోయిడ్ ప్రో, పీఆర్ శాఖ ఆరోఎఫ్ఆర్ యాప్‌ల ద్వారా క్షేత్ర స్థాయిలో హద్దులను గుర్తించారు. పంచాయతీ కార్యదర్శులు సైతం మాన్యువల్‌గా కూడా రైతు ఫొటోలు తీసుకుని ఇతర వివరాలను నమోదు చేశారు. క్షేత్ర స్థాయిలో వివరాలన్నీ అటవీశాఖ కేంద్ర కార్యాలయంలో నమోదయ్యాయి. అటవీశాఖ వద్ద 2005, అంతకంటే ముందు అటవీప్రాంతాలపై జీపీఎస్ చిత్రాలు ఉన్నాయి. గతంలో ప్రభుత్వం గుర్తించిన అటవీ భూముల ఆక్రమణలకు, ప్రస్తుత దరఖాస్తులకు కొంత వ్యత్యాసం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంత మందికి హక్కుపత్రాలు లభిస్తాయోనన్న అభిప్రాయాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

అర్హులందరికీ పోడు పట్టాలు



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

ఆర్‌వోఎఫ్ఆర్ చట్టం ప్రకారం పోడు భూములు సాగు చేసుకుంటున్న అర్హులందరికీ పట్టాలు పంపిణీ చేస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మంగళవారం ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమావేశమయ్యారు. పోడు దరఖాస్తుల్లో అర్హులైన వారి జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత గల ప్రతిఒక్కరికీ పోడు పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుతోపాటు రెండు ఆధారాలు 2005 సాగు చేసుకుంటున్నట్లు దరఖాస్తులకు జత చేయాలని సూచించారు. అర్హుల వివరాలు జాబితాలో ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో 'బయోమెట్రిక్'

- నేటి నుంచి బోధన, బోధనేతర సిబ్బందికి ఆన్‌లైన్ హాజరు
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పూర్తిస్థాయిలో అమలు
- ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో అమలు



జిల్లా కేంద్రంలో అధ్యాపకులకు అవగాహన కల్పిస్తున్న డీఐఈవో శ్రీధర్‌సుమన్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో నేటి నుంచి బయోమెట్రిక్ హాజరు పక్కాగా అమలు కానుంది. అన్ని ప్రభుత్వ కళాశాలలకు ఇప్పటికే బయోమెట్రిక్ యంత్రాలు పంపిణీ చేయగా, ఆన్‌లైన్ హాజరు విధానంపై మంగళవారం అధ్యాపకులకు అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో డీఐఈవో శ్రీధర్ సుమన్ అధ్యాపకులకు బయోమెట్రిక్ హాజరు విధానం గురించి పూర్తిగా వివరించారు. బుధవారం నుంచి ప్రతిరోజూ బోధన, బోధనేతర సిబ్బంది బయోమెట్రిక్ ద్వారానే తమ హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. కాగా 2019లోనే ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విధానం అందుబాటులోకి వచ్చింది. కరోనా కారణంగా అర్ధాంతరంగా నిలిచిపోయినా మళ్లీ విద్యాశాఖ ఆదేశాలతో సెప్టెంబర్ నుంచి పునఃప్రారంభించారు.

డుమ్మాలకు చెక్ పెట్టేందుకు..

బయోమెట్రిక్ హాజరు విధానం అమలుతో బోధన, బోధనేతర సిబ్బందికి విధుల డుమ్మాకు చెక్ పడనుంది. జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 11 మంది ప్రిన్సిపాళ్లు, 162 మంది అధ్యాపకులు, 42 మంది నాన్‌టీచింగ్ సిబ్బంది ఉన్నారు. ఏబీఏఎస్(ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టం) మిషన్లు డిగ్రీ, పాలిటెక్నిక్, స్కూళ్లలో విజయవంతంగా పనిచేస్తున్నాయి. కళాశాలల్లో అమలు కోసం తెలంగాణ రాష్ట్ర టెక్నికల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించారు.

మెరుగుపడనున్న విద్య..

జిల్లా వ్యాప్తంగా 647 ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే 85– 90 శాతం విజయవంతంగా బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నారు. ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 16 ఉండగా, 8 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇంటర్ విద్యార్థులు సుమారు 8 వేల మంది, డిగ్రీ చదువుతున్న వారు 2,500 మంది ఉన్నారు. బయోమెట్రిక్ వేయకుంటే జీతాల్లో కోత పడే అవకాశం ఉండటంతో అనాధికార డుమ్మాలకు ఇక సాధ్యం కాదు. దీని ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందనుంది. అయితే పలుచోట్ల సిగ్నల్ సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది.

ప్రారంభానికి బడులు సిద్ధం చేయాలి



తేలిగూడ పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో మన ఊరు– మన బడి కార్యక్రమానికి ఎంపికైన బడుల్లో పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆసిఫాబాద్ మండలం తేలిగూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం డీఈవో అశోక్‌తో కలిసి పరిశీలించారు. తేలిగూడ పాఠశాలలో రూ.15లక్షలతో ప్రహరీ, అదనపు గదులు, టాయిలెట్స్, తాగునీటి కల్పన పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే ఆయా పాఠశాలలను ప్రారంభిస్తామన్నారు. సెక్టోరియల్ అధికారి భరత్, జేఈ కిరణ్, హెచ్ఎం రమేశ్ ఉన్నారు.

వాంకిడి(ఆసిఫాబాద్): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు మన ఊరు– మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. వాంకిడి మండలంలోని వడ్డెరవాడ ప్రాథమిక పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను డీఈవో అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఎంఈవో మనుకుమార్, ఉపాధ్యాయులు జాడె రాహుల్ తదితరులు ఉన్నారు.

బదిలీల్లో పాత విధానం అమలు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్‌రూరల్: పదోన్నతులు, బదిలీల్లో పాత విధానం అమలు చేయాలని మంగళవారం ఎమ్మెల్యే సక్కు ట్రైబర్ టీచర్ జేఏసీ సభ్యులతో కలిసి కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సక్కు మాట్లాడుతూ గతంలో మాదిరిగా ఏజెన్సీ, నాన్‌ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన జాబితా రూపొందించి, వేర్వేరుగా పదోన్నతులు, బదిలీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ట్రైబర్ టీచర్ జేఏసీ సభ్యులు గంగారాం, జాదవ్ కిరణ్, భీంరావ్, శ్రీనివాస్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ఇషికాసింగ్



ఇషికాసింగ్‌కు పత్రం ఇస్తున్న నిర్వాహకులు

కాగజ్‌నగర్‌టౌన్: గుజరాత్‌లోని సైన్స్ సిటీలో ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్‌కు చెందిన విద్యార్థిని ఇషికాసింగ్ పాల్గొన్నారు. ఆక్వాఫోనికి గార్డెన్ ప్రదర్శనను ప్రదర్శించారు. అలీషా ప్రాజెక్ట్ మెంబర్‌గా వ్యవహరించారు. వీరు రూపొందించిన ఆక్వాఫోనిక్ గార్డెన్ 30వ జాతీయ స్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపికైంది. టీం లీడర్‌గా ఇషికాసింగ్ ఉండగా, ప్రాజెక్ట్ గైడ్ టీచర్‌గా రాజేశ్వరి వ్యవహరించారు. రసాయనిక రహిత ప్రపంచాన్ని ఎలా అందించాలనేది వీరు తమ ప్రాజెక్ట్ ద్వారా వివరించారు. జాతీయ స్థాయికి ఈ ప్రాజెక్ట్ రూపొందించిన విద్యార్థులను తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ శిల్ప శ్రీనివాస్, టీం మెంబర్స్ వెంకటేశ్వర్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, తెలంగాణ టీం మెంబర్, జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్ అభినందించారు.

స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రభుత్వ ఆంగ్ల భాష ఉపాధ్యాయుల (ఎల్టా) ఆధ్వర్యంలో 9, 10 తరగతుల విద్యార్థులకు స్పెల్ విజార్డ్ టెల్లింగ్ పోటీలు నిర్వహించారు. 80 మంది విద్యార్థులు హాజరయ్యారు. భీమారం ఉన్నత పాఠశాలకు చెందిన హప్సిబ, వెల్గనూర్ ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీవైష్ణవి, మంచిర్యాల బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన శివనందిని, నస్పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పవన్‌చంద్ర ప్రతిభ కనబర్చారు. వీరికి ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, ఎల్టా జిల్లా సభ్యులు బాబ్జీ, అశోక్, హరిప్రసాద్, షరీఫ్, కల్యాణి, రాజవర్ధన్, షరీక్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

2నుంచి వాలీబాల్ టోర్నీ

కోటపల్లి: పిన్నారం గ్రామంలో 2నుంచి రాష్ట్రస్థాయి ఓపెన్ టు ఆల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అంబాల రాజేశ్, హనుమంతరావు తెలిపారు. అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. పూర్తి వివరాలకు 9347319628 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

లక్ష్యం దిశగా అడుగులు

- 17 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధనకు సింగరేణి పరుగులు
- 100శాతం ఉత్పత్తికి ప్రణాళికలు
- సంస్థ గడువు ఇంకా 60 రోజులే
- రోజువారీ ఉత్పత్తి పెరిగితేనే నిర్దేశించిన లక్ష్యం సాధ్యం



భూగర్భంలో పని చేస్తున్న కార్మికులు

1.4.2022 నుంచి ఇప్పటివరకు జరిగిన ఉత్పత్తి వివరాలు

ఏరియా	లక్ష్యం (టన్నుల్లో)	సాధించింది	శాతం
కొత్తగూడెం	1,12,03,020	1,00,59,623	90
ఎల్లందు	38,99,840	40,53,714	104
మణుగూరు	94,22,704	1,03,79,823	110
ఆర్జీ-1	31,57,376	36,44,966	115
ఆర్జీ-2	69,47,084	71,06,581	102
ఆర్జీ-3	49,18,800	42,77,877	87
ఏపీఏ	17,61,772	12,83,512	73
నైనీ బ్లాక్	16,14,000	–	–
భూపాలపల్లి	39,24,360	21,31,503	54
బెల్లంపల్లి	28,40,400	21,11,206	74
మందమర్రి	43,86,564	33,45,591	76
శ్రీరాంపూర్	54,76,880	52,49,565	96
మొత్తం	5,95,52,800	5,36,43,961	90

శ్రీరాంపూర్: సింగరేణిలో ప్రొడక్షన్ కౌంట్‌డౌన్ స్టార్ట్ అయ్యింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022–23కు సంబంధించి బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధన గడువు మార్చి 31తో ముగియనుంది. అంటే.. ఇంకా 60 రోజుల్లో లక్ష్యాన్ని సాధించాల్సి ఉండగా ఆ దిశగా కంపెనీ పరుగులు పెడుతోంది. గడువు నాటికి 70 మిలియన్ టన్నుల సాధించాల్సి ఉంది. ఇది కంపెనీ ముందుగా నిర్దేశించిన అసలు లక్ష్యం కాగా, తరువాత మరింత ఉత్పత్తికి ఇంటర్నల్ టార్గెట్ కింద దాన్ని 74 మిలియన్ టన్నులకు పెంచుకున్నారు. గత సీజన్‌లో కురిసిన వర్షాల కారణంగా 70 మిలియన్ టన్నుల లక్ష్యానికే పరిమితమై ఇందుకు తగినట్లు ప్రణాళికలు చేశారు. ఇప్పటివరకు 53.64 మిలియన్ టన్నులు మాత్రమే సాధించింది. మార్చి 31నాటికి ఇంకా 17 మిలియన్ టన్నులు సాధించాల్సి ఉంది. ఇందుకు కంపెనీ వ్యాప్తంగా ఉన్న 24 భూగర్భ గనులు, 18 ఓసీపీల్లో ఉత్పత్తిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి పనిచేస్తున్నారు. కార్పొరేట్ నుంచి ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఏరియా అధికారులతో ఎక్కడ ఉత్పత్తి తగ్గింది.. ఎక్కడ పెంచవచ్చు.. తీసిన ఉత్పత్తి, లోటు ఉత్పత్తిపై సమీక్షలు నిర్వహిస్తూ ఉద్యోగులను అప్రమత్తం చేస్తున్నారు.

ఇప్పటికే 90 శాతం ఉత్పత్తి

కంపెనీ వ్యాప్తంగా ఇప్పటివరకు 11 ఏరియాలతో పాటు ఒరిస్సాలోని నైనీ బొగ్గు బ్లాకులతో కలిపి 30.01.2023 నాటికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 59.55 మిలియన్ టన్నులకు గాను 53.64 మిలియన్ టన్నులు సాధించింది. దీంతో 90శాతం ఉత్పత్తి నమోదైంది. నైనీ బ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తి జరిగితే అంతర్గతంగా పెట్టుకున్న 74 మిలియన్ టన్నుల ఉత్పత్తి కూడా సాధించే అవకాశం ఉండేది. కానీ.. ఆ బ్లాక్‌కు టార్గెట్ ఇచ్చినా ఇంకా ఉత్పత్తి మొదలు కాలేదని అధికారులు పేర్కొంటున్నారు. ఇలా.. ప్రస్తుతం రోజువారీ ఉత్పత్తి లక్ష్యం 2.2 లక్షల టన్నుల నుంచి 2.3 లక్షల టన్నుల వరకు వస్తోంది. ఇది మిగతా 60 రోజుల్లో 2.5 లక్షల టన్నులకు పెరిగితే కంపెనీ 100 శాతం ఉత్పత్తి సాధించే అవకాశం ఉంది.

శ్రీరాంపూర్‌లో 101శాతం..

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్ గనుల్లో జనవరిలో నిర్దేశించిన ఉత్పత్తిలో 101 శాతం సాధించినట్లు ఏరియా జీఎం బీ సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. జనవరిలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 6,26,500 టన్నులకు గాను 6,31,274 టన్నులు సాధించినట్లు చెప్పారు. 1.04.2022 నుంచి ఇప్పటివరకు నిర్దేశించిన 55.27లక్షల టన్నుల లక్ష్యానికి గాను 52.94 లక్షల టన్నులు సాధించి 96 శా తం లక్ష్యాన్ని చేరుకున్నామని తెలిపారు. బొగ్గు రవాణాలో శ్రీరాంపూర్ సీహెచ్‌పీ రికార్డు సృష్టించిందని పేర్కొన్నారు. గత నెల 7,43,951 టన్నులు రవాణా చేసి ఆల్‌టైం రికార్డు నమోదు చేసుకుందని పేర్కొన్నారు. ఆర్కే–5, ఆర్కే–6 గనులకు పర్యావరణ అనుమతుల దృష్ట్యా ఏటా 3 లక్షల టన్నులు తీయాల్సి ఉండగా గతంలో దీన్ని ఛేదించినట్లు తెలిపారు. దీంతో ఈసీ వాయిలేషన్ కింద మళ్లీ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ఈ నెల 16న కృష్ణాకాలనీలోని శాంతిమైదానంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీరాంపూర్‌లో ఉత్పత్తి అయిన బొగ్గులో అధికశాతం జైపూర్‌లోని ఎస్టీపీపీకి రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రైలు మార్గం ద్వారా రవాణా చేస్తున్నామని, రైలు మార్గాన్ని విద్యుదీకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. గత నెల 41మందికి కారుణ్య ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. ఏరియా ఎస్వోటూ జీఎం త్యాగరాజు, డీజీఎంలు గోవిందరాజు (పర్సనల్), చిరంజీవి (ఐఈడీ), సీనియర్ పీవో కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి ఏరియాలో 80 శాతం



ఉత్పత్తి వివరాలు వెల్లడిస్తున్న జీఎం శ్రీనివాస్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో జనవరిలో 80 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగినట్లు ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేకే–1గనిలో 12,158 టన్నులు, కేకే–5లో 15,466, కాసిపేట గనిలో 8,608, కాసిపేట–2లో 5,800, శాంతిఖని గనిలో 6,109, కేకే–ఓసీలో 1,83,830, రామకృష్ణాపూర్ ఓసీలో 1,90,241 టన్నుల ఉత్పత్తి సాధించినట్లు చెప్పారు. ఓవరాల్‌గా ఏరియాలో 5,34,200 టన్నుల ఉత్పత్తి లక్ష్యం కాగా 4,28,725 టన్నుల ఉత్పత్తి అనగా 80 శాతం సాధించామని పేర్కొన్నారు. ఏరి యాలోని కేకే–1 గని, కేకే ఓసీ గనుల్లో వందశాతం ఉత్పత్తి దాటిందని తెలిపారు. ఆ గనుల ఉద్యోగులను ఆదర్శంగా తీసుకుని మిగతా గనుల ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఎస్వోటూ జీఎం కృష్ణారావు, ఐఈడీ రాజన్న, ఆఫీస్ హెచ్‌వోడీ శ్యాం సుందర్, కేకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేశ్, సీనియర్ పర్సనల్ మేనేజర్ మైత్రేయబంధు ఉన్నారు.

ఆస్తుల భద్రతపై సమీక్ష

శ్రీరాంపూర్: కంపెనీ ఆస్తుల భద్రతపై సింగరేణి చీఫ్ సెక్యూరిటీ అధికారి సీహెచ్ శశిధర్ రాజు సమీక్ష నిర్వహించారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్‌కు వచ్చిన సందర్భంగా ఏరియాలోని పలు సెక్యూరిటీ చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఓసీపీల వద్ద ఉన్న బూమ్ బ్యారల్ పని తీరును పరిశీలించారు. సుశి కంపెనీ డీజిల్ బంక్‌లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన ఏరియా జీఎం బీ సంజీవరెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏరియాలో ఎస్అండ్‌పీసీ విభాగం చేపడుతున్న భద్రత చర్యలపై సమీక్షించారు. చోరీలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఏరియా సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, వీటీఎస్ ఇన్‌చార్జి సంపత్‌రెడ్డి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎండీ అజీమొద్దీన్, జమేదార్ కనకయ్య పాల్గొన్నారు.

సైన్స్ ఫేర్‌లో విద్యార్థి ప్రతిభ



బహుమతి తీసుకుంటున్న విద్యార్థి

జన్నారం: కేరళ రాష్ట్రంలోని తిరుచానూరులో నిర్వహించిన దక్షిణ భారతదేశం సైన్స్‌ఫేర్ –2023లో భాగంగా మండలంలోని బాదంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి జాడి జగదీశ్వర్ వ్యక్తిగత కేటగిరీలో రెండో బహుమతి పొందాడు. ఈ మేరకు కేరళ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఐఏఎస్ అధికారి జీవన్‌బాబు చేతుల మీదుగా విద్యార్థికి గైడ్ టీచర్ దేవ రాజయ్య రూ.5000 నగదుతోపాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందజేసినట్లు ఎంఈవో విజయ్‌కుమార్ తెలిపారు. జగదీశ్వర్ తయారు చేసిన ఎలక్ట్రికల్ స్పైడర్ అనే వస్తువుకు ఈ స్థానం దక్కడం సంతోషంగా ఉందన్నారు. జన్నారం మండల విద్యార్థి దక్షిణ భారత దేశ స్థాయికి వెళ్లి బహుమతి సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా గైడ్ టీచర్, విద్యార్థిని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి మదుబాబు, ఎంఈవో విజయ్‌కుమార్ అభినందించారు.

డిప్లొమా చదివినా.. పాడినే నమ్ముకుని..

- స్వయం ఉపాధిలో యువకుడు
- ఆదర్శంగా నిలుస్తున్న అరుణ్



గేదె పాలు పితుకుతున్న అరుణ్

దండేపల్లి: అతడు ప్రభుత్వ కొలువు కొట్టాలని మైనింగ్ డిప్లొమా పూర్తి చేశాడు. ఉద్యోగ నోటిఫికేషన్లు రాగా నిరాశ చెందాడు. ఖాళీగా ఉండి సమయాన్ని వృథా చేయొద్దని భావించాడు. మినీ డెయిరీ స్థాపించి స్వయం ఉపాధి పొందుతున్నాడు. యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. వివరాలు.. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన కొండు అరుణ్ మైనింగ్ డిప్లొమా పూర్తిచేశాడు. ఉద్యోగ నోటిఫికేషన్లు రాకపోవడంతో స్వయం ఉపాధి వైపు దృష్టి సారించాడు. తండ్రి సత్తయ్య తనకున్న ఎకరంలో వ్యవసాయం చేస్తూనే ఖాళీ సమయంలో తాపీమేస్త్రీ పనులకు వెళ్తుంటాడు. దీంతో అరుణ్ వ్యవసాయానికి అనుబంధంగా ఉండే పాడి వైపు దృష్టిసారించాడు. రెండేళ్ల క్రితం ఐదు గేదెలను కొనుగోలు చేశాడు. వాటికోసం వారి పొలం వద్ద రేకుల షెడ్ నిర్మించాడు. పొలంలో కొంత పశుగ్రాసాన్ని సాగుచేశాడు. ప్రస్తుతం అతడికి ఆరు గేదెలుండగా రోజుకు 20 లీటర్ల పాల ఉత్పత్తి సాధిస్తున్నాడు. గ్రామంలోనే లీటర్‌కు రూ.60 చొప్పున విక్రయిస్తూ రోజుకు రూ.1,200 వరకు ఆదాయం పొందుతున్నాడు. నెలకు సుమారు రూ.36వేలు వస్తుండగా డెయిరీ నిర్వహణకు రూ.16వేల ఖర్చులు పోనూ రూ.20వేలు మిగులుతున్నట్లు చెబుతున్నాడు. ప్రభుత్వం సబ్సిడీపై రుణం ఇస్తే మరిన్ని గేదెలు కొనుగోలు చేసి డెయిరీని అభివృద్ధి చేస్తానని, తనతోపాటు మరో కొందరికి ఉపాధి కల్పిస్తానని చెబుతున్నాడు.

అక్రమ వెంచర్లపై మున్సిపల్ కొరడా



ప్రహరీని తొలగింపజేస్తున్న కమిషనర్, సిబ్బంది

- ప్రహరీ కూల్చివేతల అడ్డగింపు
- ప్రజాప్రతినిధులు, అధికారులకు డబ్బులిచ్చానని ఒకరి హల్‌చల్
- మధ్యలోనే వెళ్లిన అధికారులు

నస్పూర్: పట్టణ పరిధిలో వెలసిన అక్రమ వెంచర్లపై మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించారు. మంగళవారం పట్టణంలోని నస్పూర్ శివారు 24, 27 సర్వే నంబర్లలో కలెక్టరేట్‌కు ఆనుకుని అక్రమంగా వెలసిన వెంచర్లపై మున్సిపల్ కమిషనర్ టీ రమేశ్ ఆధ్వర్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. మూడు వెంచర్ల చుట్టూ నిర్మించిన ప్రహరీలను ట్రాక్టర్ సాయంతో తొలగించారు. ఈ క్రమంలో అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి వచ్చి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తాము స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులకు రూ.లక్షలు ముట్టజెప్పామని ఆరోపించారు. తాము వెంచర్ల ఏర్పాటుకు సిద్ధమైనపుడే అడ్డుకోకుండా పూర్తి చేసి ప్లాట్లు విక్రయించాక ప్రహరీలు కూల్చడమేమిటని ప్రశ్నించారు. దీంతో అధికారులు అర్ధంతరంగా వెనుదిరిగారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ రమేశ్ స్పందిస్తూ.. పట్టణ పరిధిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లు, అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేని వెంచర్లలో ఎవరూ ప్లాట్లు కొని మోసపోవద్దు సూచించారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా పలువురు కౌన్సిలర్లు తనపై చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఇంట్లో పరిశీలిస్తున్న ఎస్సై ప్రసాద్

లక్సెట్టిపేట: మున్సిపాల్టీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి నారాయణ ఇంట్లో చోరీ జరిగినట్లు స్థానిక సెకండ్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రసాద్ తన కుటుంబసభ్యులతో కలిసి రెండురోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువా తాళం పగులగొట్టి అందులోని రూ.10వేల నగదు, నగలు ఎత్తుకెళ్లారు. బాధిత కుటుంబీకులు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

బెజ్జూర్: పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని నాగుల్వాయి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగుల్వాయి గ్రామానికి చెందిన మోర్లె బిజ్జు మేర (74) జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స కోసం అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

10న పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పడ్తనపల్లిలోని రాంపూర్ శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో ఈ నెల 19న పూర్వ విద్యార్థుల ఆత్మీయ మహా సమ్మేళనం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థి పరిషత్ సభ్యులు తెలిపారు. మంగళవారం రాంపూర్ ఆవాస విద్యాలయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామన్న, పూర్వ విద్యార్థులు పూస్కూరి శ్రీనివాసరావు, అశోక్, పరిషత్ సభ్యులు కలిసి మహాసమ్మేళనం ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆవాస విద్యాలయం ఏర్పాటు చేసి 43 ఏళ్లు పూర్తవుతుందని పేర్కొంటూ పాఠశాలలో పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం నిర్వహించేందుకు కార్యాచరణ తయారు చేసినట్లు తెలిపారు. 43 ఏళ్లలో ఆవాస విద్యాలయంలో ఇప్పటివరకు చదువుకున్న విద్యార్థులంతా మహాసమ్మేళనానికి హాజరుకావాలని పూర్వ విద్యార్థి పరిషత్ పిలుపునిచ్చింది.

ఆధార్ అనుసంధానమైతేనే చెల్లింపులు

పాతమంచిర్యాల: 2023 జనవరి నుంచి జాబ్ కార్డుతో ఆధార్‌కార్డు అనుసంధానం ఉన్న ఉపాధిహామీ కూలీల ఖాతాలకే వేతనాలు జమచేయాలని గ్రామీణాభివృద్ధి సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 1.51 లక్షల మంది జాబ్‌కార్డులు కలిగి ఉండగా ఇప్పటివరకు 1.47 లక్షల జాబ్‌కార్డులకు అధికారులు ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తి చేశారు. ఆధార్ కార్డులో ఉన్న పేరే జాబ్‌కార్డులో ఉండాలని.. జాబ్‌కార్డుకు బ్యాంక్, పోస్టాఫీస్ ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేస్తున్నామని అధికారులు తెలిపారు. పేర్లలో తేడాలుంటే ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో కూలీలకు మస్టర్లకు అనుమతించడం లేదని పేర్కొన్నారు. దీంతో తప్పనిసరిగా కూలీల ఆధార్‌కార్డులు, జాబ్‌కార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పేర్లలో తేడాలు లేకుండా ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో పొందుపరుస్తున్నారు. ఆధార్‌కార్డుతో జాబ్‌కార్డు, బ్యాంక్, పోస్టాఫీస్ ఖాతాలను అనుసంధానం చేసుకోవాలని, ఆధార్‌కార్డులు అప్‌డేట్ చేసుకోవాలని అధికారులు కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు.

తల్లిని హతమార్చిన కొడుకుకు జీవిత ఖైదు

కాగజ్‌నగర్‌టౌన్: తల్లిని హతమార్చిన కొడుకుకు జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ ప్రిన్సిపల్ జిల్లా, సెషన్ జడ్జి డీ రవీంద్రశర్మ తీర్పు చెప్పారు. లైజన్ ఆఫీసర్ సిరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2019 నవంబర్ 21న తాడూరి ప్రశాంత్ తనకు పెండ్లి చేయడం లేదని తల్లి సంధ్యారాణి (52)పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. సంధ్యారాణికి కడుపు, మెడపై తీవ్ర గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వారం తర్వాత మృతి చెందింది. అప్పటి సీఐ కిరణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. పీపీ జీఏస్ ప్రసాద్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయగా ఈ మేరకు జడ్జి పైతీర్పు ఇచ్చినట్లు వివరించారు.

పన్ను మినహాయించాలని ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: బొగ్గు గని కార్మికులకు ఆదాయ పన్ను మినహాయించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు షేక్ బాజీ సైదా, వీరభద్రయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ.. కార్మికులు 12నెలలు పని చేస్తే అందులో నాలుగు నెలల వేతనం ఆదాయ పన్ను రూపంలో చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. ప్రకృతికి విరుద్ధంగా ప్రాణాలకు తెగించి భూగర్భంలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు ఆదాయ పన్ను విధించడం దారుణమన్నారు. పన్ను స్లాబు రేట్లు పెంచకపోవడం వల్ల గనుల్లో కొత్తగా నియామకమైన బదిలీ వర్కర్లు కూడా పన్ను చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శులు కొట్టె కిషన్‌రావు, మోతుకూరి కొమురయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు రాచర్ల చంద్రమోహన్, సుదర్శన్ ఇప్పకాయల లింగయ్య, చిప్ప నర్సయ్య, శ్రీరాంపూర్ ఏరియా సహాయ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు చట్టాలు తేవాలి



మాట్లాడుతున్న ముదుపు నళినీరెడ్డి

పాతమంచిర్యాల: మహిళల రక్షణకు కఠినమైన చట్టాలు తీసుకురావాలని భారత మహిళా సమాఖ్య రాష్ట్ర క్యాదర్శి ముదుపు నళినీరెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మహిళా సమాఖ్య జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడిచినా మహిళలు అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరగలేకపోతున్నారని తెలిపారు. నిర్భయ లాంటి చట్టాలు ఉన్నప్పటికీ మహిళలపై లైంగికదాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రతి జిల్లాలో మహిళా న్యాయస్థానం ఏర్పాటు చేయాలని, మండలానికో మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డ్వాక్రా గ్రూప్ సంఘాల మహిళలకు రూ.10 లక్షలు వడ్డీ లేని రుణం ఇవ్వాలని, తెల్లరేషన్ కార్డు దారులకు నిత్యావసర సరుకులు అందించాలని, గ్యాస్ ధరలు తగ్గించాలని, మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు బొల్లం పూర్ణిమ, నాయకురాలు రేగుంట చంద్రకళ, గుండ సరోజన, బియ్యపు పద్మ, తోకల సరస్వతి, బియ్యాల భవానీ, లింగం జమున, దుర్గం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గల్ఫ్ సమితి ఆవిర్భావ వేడుకలు



మాట్లాడుతున్న గల్ఫ్ కార్మికులు

జన్నారం: తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆవిర్భావ వేడుకలు రాష్ట్ర అధ్యక్షుడు కల్లెడ భూమన్న ఆదేశాల మేరకు మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సమితి సభ్యులు ర్యాలీగా వచ్చి బస్టాండ్ ప్రాంతంలో గల్ఫ్ జెండా ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందజేశారు. గల్ఫ్ కార్మిక సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు పాలాజీ శ్రీనివాస్, నాయకులు తిరుపతి, ఎల్లయ్య, సత్యం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి మరిచిందని ఆరోపించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. బొంబాయి, దుబాయి వెళ్లిన వారిని వెనక్కి తెప్పించి ఉపాధి చూపుతామని, గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.500 కోట్లు కేటాయిస్తామని సీఎం హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ నెరవేరలేదని ఆరోపించారు. వచ్చే బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గల్ఫ్ కార్మికులు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.2.28లక్షల ఆదాయం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 17నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే జాతరలో దుకాణా సముదాయాల ఏర్పాటుకు మంగళవారం ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించారు. లడ్డూ, పులిహోర అమ్మేందుకు రూ.1.18లక్షలు, కొబ్బరి కాయల దుకాణానికి రూ.1.05 లక్షలు, నూనె అమ్మేందుకు రూ.5,500కు వేలం ద్వారా వచ్చినట్లు ఆలయ ఈవో రవి తెలిపారు. కాగా ఈ ఏడాది వేలం ద్వారా రూ.2.28లక్షల వరకు ఆదాయం రాగా, గతేడాది కంటే రూ.55వేల ఆదాయం ఎక్కువగా వచ్చింది. బోనాల చెల్లింపులకు వేలం పాటలో ఎవరూ ముందుకు రాక పోవడంతో తిరిగి 7వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తోట మధుకర్, వేలాల మల్లన్నస్వామి ఆలయ ఈవో రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.